సాక్షి నిర్మల్

మంగళవారం ၊ 25 ၊ ఏప్రిల్ ၊ 2023



బావుల కింద.. సిరుల పంట

లక్ష్మణచాంద మండలం బోరిగాంలో మాత్రం ఏ చేన్లలో ఎక్కడ చూసిన ఊటబావులే దర్శన మిస్తాయి. రెండు కాలాలు ఊట బావుల్లో నీళ్లు ఊరుతూనే ఉంటాయి. ఎప్పుడూ పంటలు కళకళ లాడుతుంటాయి. 8లో▸

రేపు జాబ్ మేళా

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని నిరుద్యోగ యువత కు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు కల్పించేందు కు ఈనెల 26న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సుస్థిర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌లో టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ మేనేజర్స్ ఉద్యోగాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గలవారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
35.5 /23.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు చాలావరకు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. మధ్యాహ్నం తర్వాత చాలాచోట్ల వడగండ్ల వాన కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నిర్మల్ నియోజకవర్గ స్థాయి ప్రతి నిధుల సభ నిర్వహిస్తున్న ట్లు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని గ్రామాలు, వార్డుల్లో పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. 10:30 గంటలకు సభా స్థలికి చేరుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ అభివృద్ధి, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ తరఫున చేపట్టిన కార్యక్రమాలపై చర్చించనున్నట్లు వివరించారు. నియోజకవర్గం పరిధిలోని పార్టీ గ్రామ, వార్డు, మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో, మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్, సీనియర్ నా యకులు సమావేశాలకు రావాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

భైంసారూరల్: ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కుంబి, ఇలేగాం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేపడుతున్న పనుల వివరాలు, చెల్లిస్తున్న కూలి గురించి అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డులు లేని కూలీలు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏపీవో శివలింగం ఉన్నారు.

ప్రభుత్వమే మక్కలు కొనాలి



మాట్లాడుతున్న రమాదేవి

లోకేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వమే మక్కలు కొనుగోలు చేయాలని, మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీలో సోమవారం మక్కలను పరిశీలించి మాట్లాడారు. రైతులు యాసంగిలో పండించిన మక్కలకు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాలకు మక్కలను ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఆమె వెంట బీజేపీ నాయకులు సందీప్, రైతులు రమేశ్, తోట దేవేందర్, రాజేశ్వర్, నర్సయ్య, దేవన్న ఉన్నారు.

జూన్ నుంచి పూర్తిస్థాయి బెటాలియన్

- అదనపు డీజీపీ స్వాతి లక్రా



పనుల వివరాలు తెలుసుకుంటున్న స్వాతిలక్రా

భైంసాటౌన్: భైంసా పట్టణ శివారులో ఏర్పాటు చేస్తున్న టీఎస్‌ఎస్పీ రెండో బెటాలియన్ సబ్ హెడ్‌క్వార్టర్ జూన్ నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అదనపు డీజీపీ స్వాతి లక్రా తెలిపారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బెటాలియన్ అధికారులతో కలిసి సోమవారం బెటాలియన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, చేపట్టాల్సిన పనులు, తదితర వివరాలు బెటాలియన్ డీఎస్పీ జయరాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. బ్యారక్, కిచెన్, మరుగుదొడ్ల పనులు ముందుగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో బెటాలియన్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని, మూడు కంపెనీల భద్రతా బలగాలు జూన్ నుంచి పూర్తిస్థాయిలో బెటాలియన్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సమ్మె చేస్తే ఎస్మా ప్రయోగిస్తాం

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ సంస్థల్లో అత్యవసర సర్వీసుల చట్టం అమలులో ఉన్నందున ఆర్టిజన్లు సమ్మెకు దిగితే ఎస్మా ప్రయోగిస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ జేఆర్.చౌహాన్ తెలిపారు. ఈనెల 15వ తేదీన విద్యుత్ కార్మిక సంఘాలతో వేతన సవరణ ఒప్పందం ముగిసిందని ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొంటే సర్వీసు నిబంధన 34 (20) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కిస్తీలు ఎట్ల కట్టాలె?



ఈ ఫొటోలోని ప్రజాప్రతినిధి లోకేశ్వరం మండలం హవర్గ పంచాయతీ సర్పంచ్ భుజంగ్‌రావు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ అవసరాల కోసం 2020లో పంచాయతీ అకౌంట్‌లో ఉన్న రూ.3 లక్షలు, భైంసా ఎస్‌బీఐలో మరో రూ.3 లక్షలు రుణం తీసుకుని ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. మరో రూ.3 లక్షలు ప్రైవేటుగా అప్పుచేసి ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేశాడు. ప్రతీ మూడు నెలల కోసారి బ్యాంకులు రూ.42 వేలు కిస్తీ చెల్లించాల్సి ఉంది. అయితే ఆరు నెలలుగా పంచాయతీలకు అభివృద్ధి నిధులు రాకపోవడంతో వాయిదాలు కట్టడం లేదు. బ్యాంకు అధికారులు తరచూ ఫోన్‌చేస్తున్నారు. దీంతో వ్యక్తిగత పనులకు కూడా బ్యాంకుకు వెళ్లలేక పోతున్నానని భుజంగరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఒక్క భుజంగ్‌రావు పరిస్థితే కాదు. జిల్లాలో చిన్న పంచాయతీలకు చెందిన 40 మంది సర్పంచుల పరిస్థితి ఇదే.



హవర్గ పంచాయతీ కొనుగోలు చేసిన ట్రాక్టర్‌తో ఇంటింటా చెత్త సేకరణ

- అప్పులు చేసి పంచాయతీ ట్రాక్టర్ల కొనుగోలు
- నిధులు రాక ఇబ్బంది పడుతున్న సర్పంచులు
- చిన్న పంచాయతీల పరిస్థితి దారుణం

జిల్లాలో గ్రామ పంచాయతీలు, జనాభా వివరాలు ..

500 లోపు జనాభా ఉన్న జీపీలు	63
1000 లోపు జనాభా ఉన్న జీపీలు	130
2 వేల లోపు జనాభా ఉన్న జీపీలు	129
3 వేలలోపు జనాభా ఉన్న జీపీలు	47
4 వేలలోపు జనాభా ఉన్న జీపీలు	19
5 వేలకుపైగా జనాభా ఉన్న జీపీలు	08

లోకేశ్వరం: పంచాయతీలకు ఆరు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు రావడం లేదు. దీంతో పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు కూడా చెల్లించడం లేదు. మరోవైపు పంచాయతీ అవసరాల కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు కిస్తీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. వాహనాల డీజిల్‌కు కూడా డబ్బులు లేక సర్పంచులు అప్పులు చేస్తున్నారు. ట్రాక్టర్ల కిస్తీలు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏం సమాధానం చెప్పాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని, కొన్నిసార్లు ఫోన్లు ఎత్తడం లేదని పేర్కొంటున్నారు.

నిధుల విడుదలలో జాప్యం..

గ్రామాల అభివృద్ధికి ప్రతినెలా కేంద్రం 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదల చేయాలి. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాటా నిధులు ఇవ్వాలి. కానీ ఆరు నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో సర్పంచులు పంచాయతీల్లో పనులు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల అభివృద్ధికి ఇచ్చే నిధులతో ఊరిలో అభివృద్ధి పనులు మాత్రమే చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా చర్యలు చేపట్టింది. ఆరు నెలల క్రితం కేంద్రం పంచాయతీల ఖాతాల్లో నేరుగా జమ చేసిన నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. కేంద్రం ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ వాటా నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో పంచాయతీలు నిధులు లేక నీరసించిపోతున్నాయి. నెలనెలా పన్నులు వసూలు అవుతున్న మేజర్ గ్రామ పంచాయతీలు, పరిశ్రమలు ఉన్న పంచాయతీలకు నిధుల బాధ లేదు. చిన్న పంచాయతీలు మాత్రం ఆదాయం లేక నిధులు రాక ట్రాక్టర్ల రుణ వాయిదాలు, విద్యుత్ బిల్లులు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని సర్పంచులు కోరుతున్నారు.

కొత్త జీపీల ఇబ్బందులు..

240 పంచాయతీలుగా ఉన్న నిర్మల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం 2019లో 500 జనాభా ఉన్న అనుబంధ గ్రామాలు, తండాలను పంచాయతీలుగా ప్రకటించింది. దీంతో జిల్లాలో కొత్తగా 156 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. దీంతో జిల్లాలో మొత్తం పంచాయతీల సంఖ్య 396కు చేరుకుంది. 2020లో చెత్త సేకరణ, గ్రామపంచాయతీ అవసరాల కోసం ప్రతీ గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అన్ని గ్రామాల సర్పంచులు రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ కొనుగోలు చేశారు. 74 మేజర్ పంచాయతీల సర్పంచులు మాత్రం పూర్తిగా నగదు చెల్లించి ట్రాక్టర్ కొనుగోలు చేశారు. మిగతా 322 పంచాయతీలకు చెందిన సర్పంచులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని, ప్రైవేటుగా అప్పులు చేసి కొనుగోలు చేశారు. మూడు నెలలకోసారి బ్యాంకులకు కిస్తీలు చెల్లించాలి. కానీ ఆరు నెలలుగా ప్రభుత్వాలు నిధులు ఇవ్వకపోవడంతో కిస్తీలు కట్టడం లేదు. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ వాయిదాల చెల్లింపునకు ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. నెలనెలా అభివృద్ధి నిధులు వచ్చేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. జీపీలకు నిధులు మంజూరు కాగానే పంచాయతీల ఖాతాల్లో జమచేస్తాం.

– శ్రీలత, డీపీవో



అభివాదం చేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



స్వాగత ర్యాలీకి భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

కమలం జెండా ఎగరేద్దాం

- బీఆర్‌ఎస్‌ను ఓడించేది బీజేపీయే..
- మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- నిర్మల్‌లో ఘనంగా స్వాగతం

నిర్మల్: నిర్మల్‌గడ్డపై ఈసారి కమలం జెండా ఎగరేద్దామని, ఇందుకు ప్రతిఒక్కరూ తనకు అండగా నిలువాలని మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బీజేపీలో చేరిన తర్వాత తొలిసారి సోమవారం నిర్మల్‌కు వచ్చిన ఆయనకు ఘనస్వాగతం లభించింది. భారీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు, మహేశ్వర్‌రెడ్డి అభిమానులు జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. గంజాల్ టోల్‌ప్లాజా వద్ద గజమాలతో స్వాగతం పలికారు. నిర్మల్‌లో కొండాపూర్ బైపాస్ నుంచి దారి పొడవునా కాషాయజెండాలతో, బీజేపీ జిందాబాద్, మహేశన్న జిందాబాద్ నినాదాలతో స్వాగతం పలికారు. శివాజీ, అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు మహేశ్వర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చివరకు బీజేపీ కార్యాలయానికి వెళ్లి పార్టీ వ్యవస్థాపకులకు నివాళులర్పించారు.

బీజేపీని గెలిపించుకుందాం..

రాష్ట్రంలో అరాచక పాలనను ఓడించే సత్తా కేవలం బీజేపీకే ఉందని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. తాను 15 ఏళ్లు కాంగ్రెస్‌లో కమిట్‌మెంట్‌తో పనిచేశానన్నారు. అలాంటి నన్ను షోకాజ్ నోటీసులతో బయటకు పంపాలని చూశారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఓడించే సత్తా మోదీ సారథ్యంలోని బీజేపీకే ఉన్నందున ఈ పార్టీలో చేరానని తెలిపారు. ర్యాలీలో మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మెరాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామారావుపటేల్, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అప్పాల గణేశ్‌చక్రవర్తి, జెడ్పీటీసీ జానుబాయి, నాయిడి మురళీధర్, సాదం అరవింద్, నర్సాగౌడ్, సాగర్, రితేశ్ రాథోడ్, దొడ్డికింద ముత్యంరెడ్డి, నాందేడపు చిన్ను, సత్యం చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.





తమ భూమి తమకు ఇప్పించాలంటూ లోకేశ్వరం మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన కొబ్బనోళ్ల గంగన్న కుటుంబం కలెక్టరేట్‌లో సోమవారం పొర్లుదండాలు పెట్టింది. నెలరోజులుగా కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో సోమవారం ఎర్రటి ఎండలో కలెక్టరేట్ ప్రధాన గేటు నుంచి ప్రజావాణి హాల్ వరకు పొర్లుదండాలు పెడుతూ వచ్చారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్వయంగా వారి వద్దకు వచ్చి గ్రీవెన్స్‌లోకి రావాలని సూచించారు. వారు అక్కడికి వెళ్లి తమ గోడును వెల్లబోసుకున్నారు. తాము సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమి తమది కాదంటూ పక్క గ్రామం అబ్దుల్లాపూర్ సర్పంచ్, వీడీసీలు ఆక్రమించారని, మండల అధికారులు సైతం వారికే వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. గతంలో ప్రజావాణిలో విన్నవించినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్య విన్న కలెక్టర్ మరోసారి సర్వే చేయిస్తామని చెప్పారు. తమకు న్యాయం జరగాలని, తమ భూమి తమకే ఇవ్వాలని బాధితులు వేడుకున్నారు. - నిర్మల్

రైతులకు పరిహారం



వడగళ్ల వానకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట (ఫైల్)

- జిల్లాకు రూ.42 లక్షలు విడుదల
- త్వరలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- 467 మందికే పరిహారం

నిర్మల్‌చైన్‌గేట్: యాసంగి సీజన్‌కు సంబంధించి మార్చిలో కురిసిన వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఈమేరకు జిల్లాకు రూ.42 లక్షలు మంజూరు చేసింది. పంటలు నష్టపోయిన 40 రోజులకు పరిహారం మంజూరైంది.

ఎకరాకు రూ.10 వేలు..

పంటల సాగులో వచ్చిన మార్పులు, వాడుతున్న సాంకేతికత, వినియోగిస్తున్న పురుగు మందులు, ఎరువుల కారణంగా ఇటీవల పంట పెట్టుబడి భారీగా పెరిగింది. ఎకరాకు కనీసం రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఖర్చవుతోంది. ఉద్యాన పంటలకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఈ నేపథ్యంలో వడగండ్ల బాధితులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని ప్రతిపక్షాలు, రైతులు డిమాండ్ చేశారు. కానీ, ప్రభుత్వం పంట ఏదైనా ఎకరాకు రూ.10 వేల చొప్పున విడుదల చేసింది.

ఆగమేఘాలపై నివేదిక..

జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంటలకు తీరని నష్టం జరిగింది. ప్రభుత్వ ఆదేశంతో సర్వే చేపట్టిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మొదట ప్రాథమిక నివేదికను అందజేశారు. వర్షం కురిసిన మరుసటి రోజే నివేదిక ఇవ్వాలని చెప్పడంతో అన్ని గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం కుదరలేదు. దీంతో జిల్లాలో కేవలం 423 ఎకరాలు పంట నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు.

423 ఎకరాలకే పరిహారం...

రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటకు సంబంధించి 423 ఎకరాలకు పరిహారం మంజూరు చేసింది దీంతో జిల్లాలో 467 మంది లబ్ధిదారులకు రూ 42,30,750 కేటాయించింది త్వరలోనే లబ్ధిదారుల ఖాతాల్లో వ్యవసాయ శాఖ ట్రెజరీ ద్వారా జమ చేయనుంది.

33 శాతం నిబంధన...

అతివృష్టి లేదా అనావృష్టి అన్నదాతను అతలాకుతలం చేస్తోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం నుంచి సాయం అందాల్సి ఉండగా, సత్వర సాయం ఎండమావే అవుతోంది. వ్యవసాయ శాఖ పంట నష్టం నివేదికకు 33 శాతం నష్టం నిబంధనను అనుసరించి రూపొందిస్తోంది. రైతువారీగా నష్టపోయిన పంట 33 శాతానికి పైగా ఉంటేనే పరిహారం వస్తుందన్నమాట. ఆ నిబంధన రైతులకు గుదిబండగా మారింది.

పాత పరిహారం ఊసే లేదు..

2020లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సాగుచేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ అధికారులు సర్వే ప్రకారం 4.4 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా.. 1.25 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మరుసటి ఏడాది ఇదే తరహాలో భారీ వర్షాలు కురవటంతో 25 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు నివేదిక పంపించారు. 2021, 2022 సీజన్లలో వరుసగా కురిసిన భారీ వర్షాలకు మరో 4 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి పరిహారం ఊసే లేకుండా పోయింది.

ఖాతాల్లో జమ చేస్తాం



వరుసగా గత వ్యవసాయ సీజన్లలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం వాటిల్లింది. సర్వే నిర్వహించి వివరాలను ప్రభుత్వానికి పంపించాం. ఈ ఏడాది కూడా నష్టపోయిన పంటలకు సంబంధించిన వివరాలను మండలాల వారీగా సేకరించి నివేదిక అందించాం. కేవలం ఇటీవల కురిసిన వడగండ్లతో నష్టపోయిన పంటలకు మాత్రమే ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఈ డబ్బులను త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

– అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణికి వచ్చిన అర్జీలను అర్హత మేరకు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభ్యర్థనలు అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు.

మొక్కజొన్న పంట కొనుగోలు చేయాలి..

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి మాట్లాడుతూ యాసంగి మొక్కజొన్న పంట ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు క్వింటల్‌కు రూ.260 నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,960 గా ఉందని ప్రైవేట్ వ్యాపారులు రూ.1,700లకే కొనుగోలు చేస్తున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, నాయకులు మామూళ్ల కృష్ణదాస్, చిట్టెల్కర్ శంకర్, చుంచుల నారాయణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బినామీ టీఎఫ్‌టీ రద్దు చేయాలి..

ముథోల్ మండలం బ్రాహ్మన్‌గావ్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్ తనకు రావాల్సిన టీఎఫ్‌టీ లైసెన్స్ ఎక్సైజ్ అధికారులు స్థానికేతరులకు జారీ చేశారని, అన్ని అర్హతలు ఉన్న తనకు లైసెన్స్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆస్పత్రి స్థలం ఆక్రమణపై...



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వీడీసీ నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీ పాత దవాఖాన స్థలం ఆక్రమణపై తిమ్మాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వీడీసీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం ఆక్రమణ విషయమై సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఫిర్యాదు చేసినవారిలో బీసీ రాజన్న, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఖలీల్, బక్కశెట్టి లక్ష్మణ్, కొత్తపెల్లి సురేశ్, గంగారావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కడెం ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయండి

కడెం: కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేయాలని సీపీఐ నాయకులు సునారికారి రాజేశ్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిబ్బంది నిర్లక్ష్యంపై



విచారణకు ఆదేశిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

విచారణ జరిపించాలని డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను కలెక్టర్ ఆదేశించారు.

డిగ్రీ కళాశాలలో ఆంగ్లభాష దినోత్సవం

నిర్మల్ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆంగ్లభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆంగ్లభాష ప్రాధాన్యంపై ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా డాక్టర్ అఖిలేశ్‌కుమార్‌సింగ్ హాజరై మాట్లాడారు. ప్రముఖ ఆంగ్ల నాటక రచయిత షేక్స్పియర్ జయంతి సందర్భంగా ఏటా ఏప్రిల్ 23న ఆంగ్లభాష దినోత్సవం నిర్వహిస్తారన్నారు. మరో ముఖ్య అతిథి కడార్ల రవీంద్ర ఆంగ్లభాష నైపుణ్యాలను వివరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంగ్ల విభాగ ఆచార్యులు రవికుమార్, డాక్టర్ శంకర్, డాక్టర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్

రజితను ప్రిన్సిపాల్ భీమారావు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అతీఖ్ బేగం, అరుణ్‌కుమార్, అజయ్, పీజీ.రెడ్డి, నర్సయ్య, సరిత రాణి, రమాకాంత్, శ్రీహరి, పవన్, మురళి, రవీందర్, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం లారీతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలోని చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి లారీలో బియ్యాన్ని తరలిస్తున్నారు. బాదనకుర్తి చెక్ పోస్ట్ వద్ద స్పెషల్ బ్రాంచ్ పోలీసుల తనిఖీల్లో బియ్యం పట్టుబడింది. లారీతో సహా 250 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసి డీసీఎస్‌వో తనూజకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని డీసీఎస్‌వో తెలిపారు. కాగా, పట్టుకున్న బియ్యం బిహార్ నుంచి నాలుగు రాష్ట్రాల మీదుగా వచ్చినా ఎక్కడా ఎలాంటి స్టాంపింగ్ లేదని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఎవరైనా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాసర ఆర్జీయూకేటీలో కార్మికుల తొలగింపు!

భైంసా: బాసర ఆర్జీయూకేటీలో పనిచేస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులను విధుల నుంచి తొలగించారు. ఫస్ట్ మాన్ మేనేజ్‌మెంట్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ థర్డ్ పార్టీ తరఫున పనిచేస్తున్న ఈ కార్మికులు వర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఈ మేరకు వారిని తాత్కాలికంగా విధుల నుంచి తొలగించినట్లు వర్సిటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ తెలిపారు. కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్‌ఐ అమలులో ఏమైనా సమస్యలుంటే ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ ప్రధాన ద్వారం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు ఇప్పించాలని బీజేపీ అధ్యక్షుడు జిడ్డు సుభాష్ డిమాండ్ చేశారు.

పాల ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన పాల ట్యాంకర్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం పాల ట్యాంకర్ బోల్తాపడింది. వేలాది లీటర్ల పాలు రోడ్డు పాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ నుంచి పాల లోడుతో మహారాష్ట్రలోని ఘడ్‌చందాకు వెళ్తోంది. ఈ క్రమంలో 44వ జాతీయ రహదారిపై ముందు ఉన్న లారీ సడెన్‌గా బ్రేక్ వేయడంతో పాల ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ మలకప్ప క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రెండు కాళ్లు విరిగిపోవడంతో ఆయన్ని బయటకు తీసేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చివరకు జేసీబీతో ఆయన్ను బయటకు తీసి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

బావుల కింద.. సిరుల పంట


బోరిగాంలోని వ్యవసాయ బావి


సాగవుతున్న వరి పంట

- బోరిగాంలో ఊటబావుల ఆధారంగా వ్యవసాయం
- రెండు పంటలకు నీరు పుష్కలం
- వేసవిలోనూ బావుల్లో జలకళ
- బోరు వద్దని రైతులందరి తీర్మానం

లక్ష్మణచాంద: సాధారణంగా ఏ ఊరు..ఏ పంట చేలకు వెళ్లినా..బోరుబావుల ద్వారా సాగు చేయడం చూస్తుంటాం. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం బోరిగాంలో మాత్రం ఏ చేన్లలో ఎక్కడ చూసిన ఊటబావులే దర్శనమిస్తాయి. రెండు కాలాలు ఊట బావుల్లో నీళ్లు ఊరుతూనే ఉంటాయి. ఎప్పుడు చూసిన పంటలు కళకళలాడుతున్నాయి. ఈ బావుల ద్వారా రైతులు వివిధ పంటలు సాగుచేసి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఊటబావుల–వ్యవసాయ గ్రామంగా జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన బోరిగాంపై ప్రత్యేక కథనం.

చెరువుల్లో నీరు పుష్కలం

బోరిగాం గ్రామంలో పెద్ద చెరువు, చిన్న చెరువు, ఎర్రకుంట వంటి మూడు చెరువులు ఉన్నాయి. ఈ చెరువులే గ్రామంలో ఊటబావులకు అండగా ఉంటున్నాయి. గ్రామానికి ఓ వైపు కొండ ప్రాంతం ఉండటంతో వర్షాకాలంలో వాటిపై నుంచి వచ్చేనీరు చెరువుల్లో చేరుతుంది. చెరువుల్లో నీరు ఎప్పుడు పుష్కలంగా ఉండటంతో భూగర్భ జలాలు అడగంటకుండా ఉంటున్నాయి. ఊటలకు ఇవే కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

తీర్మానానికి కట్టుబడి..

పంటలకు నీరందించేందుకు ఇతర గ్రామాల రైతులు బోరు వేసినా నీరు సరిగ్గా రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో బోరిగాంలో భూగర్భ జలాలు కాపాడుకోవడం కోసం రైతులందరూ ఏకతాటిపై ఉండి బోరుబావులు వద్దని తీర్మానం చేసుకున్నారు. 30 ఏళ్ల కిందట తీర్మానానికి ఇప్పటికి కట్టుబడి ఉన్నారు. గత 25–30 ఏళ్ల నుంచి చేన్లలో తవ్వించిన బావుల ద్వారానే రెండుకాలాల్లో రెండు పంటలు సాగు చేస్తున్నారు.

భూగర్భ జలాలు పుష్కలం

మండలంలోని ఇతర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. రైతులు తమ చేన్లల్లో 150 ఫీట్లు తవ్వించిన తర్వాతనే నీళ్లు వస్తున్నాయి. బోరిగాంలో భూగర్భ జలాలు పై పైననే ఉన్నాయి. 8 నుంచి 10 గజాలు (40–50 ఫీట్లు)తవ్వించిన బావుల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. ఇదంతా కేవలం బోరుబావులు లేకపోవడం వల్లనే సాధ్యమైతుందని రైతులు అంటున్నారు. వేసవిలో ఏ ఒక్క బావి ఎండిపోదని చెబుతున్నారు.

పంటలు సాగు..

బోరిగాం గ్రామంలో వానాకాలంలో 325 ఎకరాలు పత్తి, 60 ఎకరాలు పసుపు, ఐదెకరాలు సోయా, 32 ఎకరాలు కందులు, 231 ఎకరాల్లో వరి పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం రెండవ పంటగా గోధుమ, వరి, మొక్కజొన్న, నువ్వుల తోపాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. అయినా తమకు నీటితో ఎటువంటి ఇబ్బంది లేదని రైతులు అంటున్నారు.

బోరిగాం గ్రామ వివరాలు

మొత్తం జనాభా	1218
కుటుంబాలు	398
రైతులు	302
బావులు	150-200
సాగు విస్తీర్ణం	594 ఎకరాలు



తీర్మానానికి కట్టుబడి..


గ్రామంలోని రైతులు తీర్మానానికి కట్టుబడి ఉండటంతో వ్యవసాయ చేనుల్లో ఒక్క బోరు వేయలేదు. ఏళ్ల క్రితం తవ్వించిన బావుల్లో ఎప్పటికి నీరు పుష్కలంగా నీరు ఉంటుంది.
– బొంగురాల అమరేశ్వర్, రైతు, బోరిగాం

బావులు తవ్వించాం


గ్రామంలో 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తాము మూడు బావులు తవ్వించాం. బావుల ద్వారానే మొక్కజొన్న, వరి, నువ్వు పంటలు సాగు చేస్తున్నాం.
– మల్లయ్య, యువ రైతు, బోరిగాం

పుష్కలంగా నీరు


గ్రామంలో రెండు పంటలు బావుల ద్వారానే సాగు చేస్తున్నాం. వేసవిలో నీటి సమస్య ఉండదు. ప్రస్తుతం బావుల్లో నీరు నిండుగా ఉన్నాయి.
– పాటిల్ గంగాధర్, యువ రైతు, బోరిగాం

కూచిపూడిలో జిల్లా కళాకారుల ప్రతిభ


అవార్డు తో దీక్షిత రెడ్డి, ఆధ్యారెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కీర్తి ఆర్ట్స్ చారిటబుల్ ట్రస్ట్, కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి, జాతీయ నృత్య దినోత్సవ సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభారతిలో సోమవారం కూచిపూడి నృత్యోత్సవం నిర్వహించారు. నిర్మల్‌కు చెందిన దీక్షితరెడ్డి, ఆద్యారెడ్డి, తేజస్విని, సుదీక్ష నృత్యం ఆహుతులను అలరించాయి. మాజీ జడ్జి బూరుగుల మధుసూదన్, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఫిలిం యాక్టర్ బాబ్జి, దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రం మెమొంటో గోల్డ్ మెడల్ అందించారు.

ఆకట్టుకున్న చిన్నారి నృత్య ప్రదర్శన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన బలాష్టు శివరామకృష్ణ–సోనీ దంపతుల కూతురు శాన్విక కూచిపూడి నృత్యప్రదర్శనలో రాణించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన ''డ్యాన్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు–2023'' కూచిపూడి నృత్యప్రదర్శనలో ప్రతిభ చాటింది. కార్యక్రమ నిర్వాహకులు గోల్డ్‌మెడల్‌తోపాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. దైవజ్ఞశర్మ, మధుసూదన్, నృత్య శిక్షకురాలు నవ్యవిజయ్ చిన్నారిని అభినందించారు.


చిన్నారికి ప్రశంసపత్రం, జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు అందజేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందజేయాలని, 317 జీవో అమలు చేసి అర్హులైన వారిని బదిలీలు చేయాలన్నారు. అర్హులైన హెడ్ నర్సులకు నర్సింగ్ సూపరింటెండెంట్లుగా, నర్సింగ్ సిబ్బందికి హెడ్ నర్సులుగా పదోన్నతి కల్పించాలన్నారు. గ్రేడ్ వన్ ఫార్మసిస్టులకు ఫార్మసిస్ట్ సూపర్‌వైజర్లుగా, రేడియోగ్రాఫర్లకు చీఫ్ రేడియోగ్రాఫర్లుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలన్నారు.

జిల్లా కార్యవర్గం..

తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభ (హెడ్‌నర్స్), ప్రధాన కార్యదర్శిగా స్వరూప (స్టాఫ్‌నర్స్), కోశాధికారిగా గురిజాల వనిత (స్టాఫ్‌నర్స్), ఉపాధ్యక్షులుగా వీణ, కళారాణి, రమ్య, సహ కార్యదర్శులుగా విజయ, సరస్వతి, రేచల్, సుజాత, కార్యవర్గ సభ్యులుగా తహేరా, లీనా, ప్రియాంక ఎన్నికయ్యారు.

స్నానానికి వెళ్లి..అనంతలోకాలకు

- చెక్‌డ్యామ్‌లో నీటమునిగి బాలుడి మృతి


హరీశ్ (ఫైల్)



హరీశ్ మృతదేహం

నేరడిగొండ: వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి గ్రామంలోని ఊరి చివరన ఉన్న చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లిన ఓ బాలుడు అనంతలోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని తర్నం(కె) గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుర్గం హరీశ్ (14) ఇటీవల 8వ తరగతి పరీక్షలు రాశాడు. వేసవి సెలవుల్లో సరదాగా తన స్నేహితులు దుర్గం రమాసాగర్, విజయ్‌కాంత్‌తో కలిసి చెక్‌డ్యామ్‌లో స్నానానికి వెళ్లాడు. నీటి లోతు ఏర్పడకపోవడంతో హరీశ్ నీటిలో మునిగాడు. స్నేహితులు గ్రామానికి చేరుకుని తండ్రికి సమాచారం అందించారు. దీంతో తండ్రితో పాటు గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. హరీశ్‌ను బయటికి తీశా రు. కొన ఊపిరితో ఉండడంతో 108 అంబులెన్స్‌లో బోథ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యుడు తెలపడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఉన్నత చదువులు చదివి భవిష్యత్తులో ఎదుగుతాడన్న కన్నకొడుకు తమ కళ్లముందే మృతిచెందడాన్ని జీర్ణించుకోలేకపోయారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మారుతి తెలిపారు.

నిధుల స్వాహాపై అధికారుల విచారణ

- రూ.20 లక్షలతో ఉడాయించిన ఐకేపీ వీవోఏ
- గతనెలలో ఫిర్యాదు చేసిన సర్పంచ్

గుడిహత్నూర్: మండల కేంద్రంలో జైగణేశ్ గ్రామైక్య సంఘానికి చెందిన 26 స్వయం సహాయక సంఘాలకు వీవోఏగా పని చేస్తున్న లత నమ్మకంగా ఉంటూ ఏకంగా రూ.20 లక్షల పైగా స్వాహా చేసి పరారైంది. గతంలో ఈ విషయాన్ని గుర్తించిన సంఘ సభ్యులు కొందరు స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గత 4న జరిగిన సమావేశంలో సర్పంచ్ సునీతా జాదవ్ అధికారులు దృష్టికి తీసుకెళ్లింది. గత 15 రోజుల నుంచి లత పరారీలో ఉంది. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో డీపీఎం హేమలత విచారణ చేపట్టారు. స్త్రీనిధి రుణాలు ఎక్కువ మొత్తంలో లత నిధులు స్వాహా చేసినట్లు తేలింది. బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించడానికి సంఘాల సభ్యులు లతకు రూ.9 లక్షలను బ్యాంకులో కట్టలేదని విచారణలో తేలింది. అధికారులు ఆమె భర్త చందును విచారించారు. పరారీలో ఉన్న లతను పిలిపించాలని కోరారు. మా మధ్య గొడవలున్నాయని రెండు నెలలుగా ఆమెతో నేను లేనని, వారంలో లతను మీ ముందుకు తీసుకువస్తానని హామీఇచ్చాడు. దీంతో విచారణను వారంపాటు వాయిదా వేశారు.


వాడుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని వీవోఏ రాసి ఇచ్చిన పత్రం

స్త్రీనిధి రుణాల్లో అవకతవకలు..

జిల్లా వ్యాప్తంగా స్త్రీ నిధి రుణాల మంజూరు నుంచి చెల్లింపు వరకు అవకతవకలు జరుగుతున్నాయి. వీవోఏగా పని చేస్తున్న లత ఆయా సంఘాల సభ్యులకు నమ్మకంగా మెదిలింది. వారికి తెలియకుండానే రుణాలు మంజూరు చేసుకుని తన ఖాతాలో మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో రూ.50 వేలు అవసరమని దరఖాస్తు పెట్టుకున్న సభ్యులకు తెలియకుండానే రూ. లక్ష పైగా మంజూరు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో పాటు వారికి రుణాలు చెల్లిస్తూ ఎన్‌పీఏ రాకుండా జాగ్రత్త పడినట్లు గుర్తించారు. ఇలా మొత్తం రూ.20 లక్షల పైచిలుకు స్వాహా చేసింది. వీరి సంఘంలో ఉన్న సర్పంచ్ జాదవ్ సునీతా సైతం మోసపోవడంతో ఈ విషయం వెలుగు చూసింది. కాగా రుణాల మంజూరు, చెల్లింపుల్లో ఐకేపీ సీసీలకు సమాచారం ఉండకపోవడంతో వీవోఏలు అవకతవకలు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. అయినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంతో వీరి ప్రమేయం ఉందని బాధిత సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ అవకతవకలను గుర్తించిన స్థానిక అధికారులు కొంత సొమ్మును వారి ద్వారా తిరిగి చెల్లిస్తామనే పత్రాలు రాసుకోవడం చర్చాంశనీయంగా మారింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు. విచారణ చేపట్టిన వారిలో సీబీవో ఆడిటర్లు గంగాధర్, శ్రీనివాస్, రాజేందర్, ఏపీవో భగవాండ్లు ఉన్నారు. స్థానిక సర్పంచ్ జాదవ్ సునీతా రమేశ్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఉప సర్పంచ్ గజానంద్ పాల్గొన్నారు.

సూపర్‌మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బస్‌డిపో ఎదురుగా కాంప్లెక్స్‌లో గల మోర్ సూపర్ మార్కెట్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కాంప్లెక్స్ సెల్లార్‌లోని విద్యుత్ మీటర్ల నుంచి మంటలు రావడంతో ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేసి అదుపులో తెచ్చారు. ఈ ప్రమాదంలో సు మారు లక్ష ఆస్తి నష్టం వాటిల్లిందని సిబ్బంది తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గాజులపేట్ కాలనీలో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం..పరస భీమేశ్ సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ సమయ ంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలార్పారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సామగ్రి కాలిపోయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు భీమేశ్ తెలిపాడు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని వాన్‌వాట్‌కు చెందిన మోతిరామ్ అడవి పంది దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామ సమీపంలో నర్సరీ వద్ద సోమవారం పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో మోతిరామ్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని అతనికి ప్రథమ చికిత్స చేసి రిమ్స్‌కు తరలించారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టా ఇప్పించాలని బేల మండలం సైద్‌పూర్‌కు చెందిన పెందూర్ గంగుబాయి కోరాడు.
- కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన ఆత్రం భగవంత్‌రావు అర్జీ అందించాడు. అదేవిధంగా గిరి వికాసం పథకం కింద త్రీఫేజ్ విద్యుత్ లైన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.
- కోళ్లఫారం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం తేజనాయక్ తండాకు చెందిన రాథోడ్ రామారావు విన్నవించాడు.

గోడు వినేవారేరి?


గూడు కోసం తన గోడు వినిపించేందుకు ఓ దివ్యాంగ వృద్ధురాలు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చింది. లక్ష్మి ప్రమాదవశాత్తు రెండు కళ్లు పనిచేయకపోవడంతో కాళ్లపై పాకుతూ భిక్షాటన చేసుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. తనకు డబుల్ బెడ్రూం ఇప్పించాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఇప్పటివరకు ఎవరు స్పందించలేదని వాపోయింది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

ఫైన్ పడకుండా..




ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నేపథ్యంలో చలాన్ల బాధ నుంచి తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారులు కవర్ చేస్తున్నారు. వాహన నంబర్ ప్లేట్లు కనిపించకుండా బట్టలు కప్పడంతోపాటు రేడియం స్టిక్కర్లను అతికించడం, ఓ నంబర్‌ను తొలగించడం చేస్తూ జరిమానా నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్యుత్ సిబ్బందిపై దాడి కేసులో ముగ్గురికి జైలు

నిర్మల్‌టౌన్: విద్యుత్ సిబ్బందిపై దాడి కేసులో ముగ్గురికి రెండు నెలల జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..నిర్మల్‌రూరల్ మండలం రత్నాపూర్‌కు చెందిన లైన్‌మెన్ కర్నాల సంతోష్ గ్రామంలో పెండింగ్ విద్యుత్ బకాయిల వసూళ్లు చేస్తున్నారు. మహిళలు ఉన్న ఒక ఇంట్లో పెండింగ్ బిల్లు రూ.20,500 ఉంది. మహిళలను బిల్లు అడిగినందుకు సిబ్బంది కర్నాల సంతోష్, ప్రభాకర్‌పై అదే గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్, షేక్ ఇమ్రాన్, షేక్ ముజాహిద్ దాడి చేశారు. నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రమణమూర్తి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ 11 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పిడుగుపాటుకు పశువులు మృతి



జైనథ్: మండలంలోని ఫౌజ్‌పూర్ గ్రామంలో మూడు పశువులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. బాధిత రైతులు తోట రాజు, తోట అనిల్, కట్కూర్ల నరేశ్ కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం వర్షం మొదలవడంతో మేతకు వెళ్లిన పశువులు చెట్టు కింద సేదతీరుతుండగా ఒక్కసారిగా పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.